క్లుప్తంగా

ఏకేసీ కాలనీలో భారీ అన్నసమారాధన



దుర్గాదేవిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీ(రాజీవ్‌కాలనీ)లో బంటు రామానాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ప్రారంభించారు. అంతకముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యులు అన్నసమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. సాయంత్రం అమ్మవారిని మేళతాళలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీర్ రెడ్డికి సత్కారం



పీర్ రెడ్డిని సత్కరించిన అజంతా పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు అజంతా పార్క్, వెంకటాపురం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టరేట్ పొందిన బోయి పీర్ రెడ్డిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆయన క్రీడల్లో చేసిన సేవలకు చెన్నైకి చెందిన సామ్ ఎడ్యుకేషనల్ అండ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించింది. ఈ సందర్భంగా ఆయన్ను అసోసియేషన్ సభ్యులు, అసోసియేషన్ గవర్నర్ కుప్పిలి ద్వారకానాథ్ సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడైన పీర్‌రెడ్డి డాక్టరేట్ రావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు చంద్రరావు, జి. ప్రసాద్, డి. కనకారావు, అజంతా పార్క్ కాలనీ కార్యదర్శి అల్లు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ తయారీదారుడి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి

పెందుర్తి: మండలంలోని పొర్లుపాలెం రెవెన్యూ పరిధి ఆర్‌ఆర్ వెంకటాపురం శివారు మేహాద్రి గెడ్డ సమీపంలోని కంపర వారి కల్లాలు వద్ద రేకుల షెడ్డులో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న కొండవలస రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి ఎస్‌ఐ ఎస్వీ భాస్కరరావు తెలిపిన వివరాలు. గోపాలపట్నం దరి పద్మనాభనగర్‌కు చెందిన రవికుమార్ 2024లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంత కాలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ వచ్చాడు. ఆ సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో మళ్లీ మందు గుండు సామగ్రి తయారీకి సిద్ధమయ్యాడు. ఐదు రోజుల నుంచి రహస్యంగా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు జరిపిన దాడిలో అక్రమంగా నిల్వ చేసిన సురేకారం, చార్కోల్, సున్నం, పీవీసీ మందు, తారా జువ్వలు, బెల్ట్ బాంబులు, డ్రిల్లింగ్ మిషన్, ప్రెస్సింగ్ మిషన్, భారీ మొత్తంలో మందుగుండు ముడి పదార్థాలు, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ భాస్కరరావు వెల్లడించారు.

వాల్తేర్ డివిజన్‌లో స్వచ్ఛ భారత్ స్పెషల్ డ్రైవ్

తాటిచెట్లపాలెం: స్వచ్ఛ భారత్ స్పెషల్ క్యాంపెయిన్-5లో భాగంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా తెలిపారు. రైల్వే అధికారులతో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ నెల 2న ప్రారంభమైన క్యాంపెయిన్‌లో భాగంగా ఉన్నతాధికారుల బృందం రైల్వే బోర్డు నిర్దేశించిన సూచనలతో కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు చెప్పారు. వాల్తేర్ డివిజన్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.



సాంబమూర్తినగర్ శివాలయం వద్ద దుమ్ము ధూళితో రహదారి



రాజీవ్‌కాలనీ వద్ద టిప్పర్ల పార్కింగ్‌తో ఇళ్లలోకి చేరుతున్న దుమ్ము, ధూళి



లెవెల్ క్రాసింగ్ వద్ద కాలుష్యంతో నిండిన రహదారి

దుమ్ము రేగుతోంది

- భారీవాహనాల రాకపోకలతో ప్రమాదాలు
- మట్టితో నిండిన సీసీ రోడ్లు
- అనారోగ్యం బారిన పడుతున్న మురికివాడల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కంచరపాలెం: కంచరపాలెం నుంచి మంత్రిపాలెం వెళ్లే రైల్వే వాషింగ్ లైన్‌లోని రహదారులు దుమ్ము, ధూళితో నిండిపోయాయి. మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. మరోవైపు భారీ టిప్పర్ల రాకపోకలతో దుమ్ము, ధూళి రేగడంతో సమీప ప్రాంతాల వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. అయినా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

కంచరపాలెం ఎఫ్‌సీఐ గిడ్డంగి రహదారి నుంచి పైడిమాంబ ఆలయం మీదుగా దయానందనగర్, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ ముత్యమాంబ కాలనీ, సాంబమూర్తినగర్, ఆశవానిపాలెం, శ్యామ్‌నగర్, అశోక్‌పార్క్, మేఘాద్రిపేట ప్రాంత ప్రజలు రాకపోకలు సాగిస్తారు. దుమ్ము రహదారుల్లో నిత్యం అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. గతేడాది ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు వేశారు. రహదారులు పోర్టు, రైల్వే ఆధీనంలో ఉండడంతో జీవీఎంసీ పారిశుధ్య అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడంతో రహదారులు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. రోడ్లు శుభ్రపరచాలంటూ జీవీఎంసీ, పోర్టు, రైల్వే అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యంగా ఉందని వాపోతున్నారు. సాంబమూర్తినగర్ శివాలయం నుంచి డీజిల్ లోకోషెడ్, వాషింగ్ లైన్‌కు వెళ్లే మార్గాలకు ఇరువైపులా షిప్పింగ్ కంపెనీలకు చెందిన బొగ్గు ఇతర ఖనిజాలు నిల్వ చేస్తారు.

అనారోగ్య సమస్యలు

రహదారులపై ఎగిరిన దుమ్ము, ధూళి రాజీవ్‌కాలనీ, ముత్యమాంబకాలనీ, చాకలిగెడ్డ, దయానందనగర్, పైడిమాంబకాలనీల్లో ఇళ్లపై పడుతుండడంతో ఊపిరితిత్తుల సమస్యలు ఎక్కువగా ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ శానిటరీ సిబ్బంది ఇక్కడ మచ్చుకు కూడా కనిపించడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ప్రమాదకర రహదారులను పరిశీలించి దుమ్ము తొలగించేటట్లు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



భారీ వాహనాల రాకపోకలతో రోడ్డుపై రేగుతున్న ధూళి

నరకం చూస్తున్నాం

కంచరపాలెం మురికివాడ ప్రజలకు ఇక్కడి టిప్పర్ల రాకపోకలతో ఇబ్బందులు పడుతున్నారు. భారీ లారీలు వెళ్లే సమయంలో దుమ్ము ద్విచక్ర వాహనదారుల కళ్లలోకి చేరుతుంది. ఆ సమయంలో నరకం కనబడుతుంది. ప్రమాదాల బారిన పడుతున్నారు. దుమ్ము ధూళి ఎగిరి గాలి ద్వారా మా కాలనీలో ఇళ్లలోకి చేరుతుంది. వృద్ధులు, పిల్లలకు ఊపిరితిత్తుల సమస్యలు ప్రబలుతున్నాయి. అధికారులు స్పందించి కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

– సంతోష్‌కుమార్, రాజీవ్‌కాలనీ, కంచరపాలెం

భారీ వాహనాలతో అవస్థలు

బొగ్గు, ఇతర పదార్థాలు తరలించేటప్పుడు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. దీంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు ద్విచక్ర వాహనాలు, పాదచారుల కళ్లలోకి దుమ్ము చేరుతుంది. నిత్యం వేల సంఖ్యలో రైల్వే లోకో, డీజిల్ షెడ్ ఉద్యోగులు, నేవల్ డాక్‌యార్డ్, షిప్‌యార్డ్ ఉద్యోగులతో పాటు ఆయా కాలనీ ప్రజలు ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము రేగే రహదారుల్లో ఆయా కంపెనీలు వాటర్ ట్యాంకర్లతో నీరు జల్లాని నిబంధనలు ఉన్నా పట్టించుకునే నాథుడు కనిపించడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము కళ్లల్లోకి చేరడంతో ప్రయాణం ప్రమాదభరితంగా మారుతుంది.



కంచరపాలెం వైపు రాకపోకలు సాగిస్తున్న భారీ టిప్పర్ వెళ్లడంతో రేగుతున్న దుమ్ము

మిత్రుడి కుటుంబానికి అండగా..



ముత్యాల నాయుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

గోపాలపట్నం: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో నివాసముంటున్న దాలిబోయిన ముత్యాలనాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్టర్ వద్ద టెక్నీషియన్‌గా పని చేసేవాడు. నాయుడు మృతితో ఆ ఉటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండడంతో స్నేహితులంతా ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.91,500 అందించారు. ఏ సమస్య వచ్చినా తామంతా ఉన్నామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఈవీఎల్ నరసింహం, కె. సతీష్, ఎం. సూరిబాబు, మోహన్, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి సన్నిధిలో ప్రత్యేక పూజలు



శ్రీహరిపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న గణబాబు

మల్కాపురం: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలను ప్రభుత్వ విప్ పి.గణబాబు ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీహరిపురం వద్ద దుర్గా ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో గణబాబు పాల్గొని అమ్మవారికి పసుపు,కుంకుమలతో పూజలు చేశారు. కార్యక్రమంలోనాయుకులు కోరాడ శ్రీనివాసరావు,శీరం ఉమా మహేశ్వరి,దంత వైద్యనిపుణులు త్రివేణి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

గోపాలపట్నం: వరుణుడు ఉరుములు.. మెరుపులతో గర్జించాడు.ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములతో సుమారు గంట పాటు పడిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ద్విచక్రవాహనదారులు ఎక్కడివారు అక్కడ నిలిచి పోయారు. వర్షం కాస్తా తగ్గడంతో తిరిగి ప్రయాణమయ్యారు. భయపెట్టిన ఉరుములు. ఉరుములు, మెరుపులు స్థానికులను భయపెట్టాయి. భారీ శబ్దాలతో ఉరుములు రావడంతో బయట ఎవరూ కనిపించలేదు. వర్షం ప్రారంభమైన కొద్ది సేపటికే భారీ ఉరుములు వచ్చాయి. ఆ తర్వాత కుండ పోతగా వర్షం కురిసింది.



గోపాలపట్నం ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం

ఆదమరిస్తే అంతే ..

ఫోకస్

జీవీఎంసీ 90వ వార్డులో ట్రెండ్స్ షోరూం సమీపంలో ఫుట్‌పాత్‌పై పలక ఊడి పడడంతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఇక్కడి ఫుట్‌పాత్ పలకలు తొలగించి మురుగునీరు తొలగించే పనులు చేపట్టారు. ఆ సమయంలో ఫుట్‌పాత్ పలకలు సరిగావేయక పోవడంతో ఒకటి లోపలకు ఒరిగి పోయింది. దీంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో మరింత ప్రమాదకరంగా ఉంటుందని వాపోతున్నారు. – గోపాలపట్నం



ప్రమాదకరంగా ఉన్న ఫుట్‌పాత్

వాకింగ్ పార్కు ఆవరణలో ఫంక్షన్లు

- ఆవరణ అంతా అపరిశుభ్రం
- ఇబ్బంది పడుతున్న వాకర్స్



వాకింగ్ ట్రాక్‌కు అడ్డంగా పెండాళ్లు



వాకింగ్ పార్కు ఆవరణలో వేడుక సెట్,మరో వైపు ట్రాక్‌పై వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలోని వాకింగ్ పార్కు శుభ కార్యాలకు వేదికగా మారింది. దీంతో వాకర్స్ ట్రాక్ పరిస్థితి చూసి ముక్కు మూసుకుని ఇళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఓపెన్ జిమ్‌ను కూడా వినియోగించుకోలేకపోతున్నారు. పార్క్‌ను కొంత మంది వివిధ శుభ, అశుభ కార్యాల భోజనాల కోసం వినియోగిస్తున్నారు. భోజనాల అనంతరం వ్యర్థాలను అక్కడే నిర్లక్ష్యంగా విడిచిపెట్టేస్తున్నారు. దీంతో ఉదయం వాకింగ్‌కు వచ్చే వారు పార్కులో అపరిశుభ్ర వాతావరణం చూసి అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్యపై జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వాకర్స్‌కు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు వాకర్స్ కోరుతున్నారు.



ఇందిరాకాలనీ వాకింగ్ పార్కు ఆవరణ చుట్టూ ఫ్లెక్సీలు



డంపింగ్ యార్డ్‌గా వాకింగ్ పార్కు

సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న శంకరనారాయణ


పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని 76వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ అన్నారు. ఈ మేరకు నడుపూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని ప్రజలు అదానీ గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్నారు. సమావేశంలో తాటికొండ జగదీష్, తలారి నాగేశ్వరరావు, బెల్లాల పెంటబాబు, బ్రహ్మానందరెడ్డి, శీరం రమణ, దాసరి రమణ, రామారావు, బెల్లాల నాగేశ్వరరావు, శరత్ కుమార్, శీర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ప్రచారం చేసున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: మండలంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుందామని, ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు స్థానిక ప్రజలంతా తరలివచ్చి తమ గొంతు వినిపించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాతగాజువాక జంక్షన్ నుంచి ప్రజలను చైతన్య పరిచేందుకు ఆదివారం ప్రచారం నిర్వహించారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో సుమారు 10 లక్షల మంది ప్రజలు తీవ్ర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎం. రాంబాబు, అయోధ్యరామయ్య, గొలగాని అప్పారావు, నూకేశ్వరరావు, బంగారునాయుడు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ నిజాయితీ



బాధితుడి బ్యాగ్‌ను అందిస్తున్న హెచ్‌సీ డీకేవీ స్వామి

పెందుర్తి: వేపగుంట ప్రాంతానికి చెందిన డొంతుకూరి వెంకటసత్యనారాయణమూర్తి ఈ నెల 3న తన ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నగదు, గృహోపకరణాలతో కూడిన బ్యాగ్ జారిపోయింది. అదే మార్గంలో వస్తున్న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డీకేవీ స్వామి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న అడ్రస్ ఆధారంగా సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగులో ఉన్న రూ.3,600 నగదు, గృహోపకరణాలను ఆదివారం అందించారు. పోయిన నగదు బ్యాగ్ అందించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ స్వామిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

పనిచేయని కోచ్ ఇండికేటర్లు

లగేజీలతో ప్రయాణికుల పరుగులు

అగనంపూడి: వేలాది మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగించే దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కోచ్ ఇండికేటర్లు పనిచేయడం లేదు. ఐదు రోజులుగా డిజిటల్ కోచ్ ఇండికేటర్లు మరమ్మతులకు గురయ్యాయి. అసలే దసరా సెలవులు ముగియడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ తరుణంలో ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారాలపై కోచ్ ఇండికేటర్లు పనిచేయని కారణంగా ప్రయాణికులు లగేజీలు, పిల్లలు, వృద్ధులతో పరుగులు తీయాల్సి వస్తుంది. వారు ఎక్కాల్సిన రైలు వచ్చినా ఏ కోచ్ ఎక్కడ ఆగుతుందో తెలియని పరిస్థితుల్లోగందరగోళానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోపోవడంతో ఐదు రోజులుగా ప్రయాణికులకు ఉరుకులు పరుగులు తప్పడం లేదు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కోచ్ ఇండికేటర్లను అందుబాటులో తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



దువ్వాడ రైల్వేస్టేషన్ 1, 4 ప్లాట్‌ఫారాలపై పనిచేయని కోచ్ ఇండికేటర్లు

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

మధురవాడ: ఏపీఎస్‌ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌ఎం అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం మధురవాడలో నిర్వహించిన రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈపీఎఫ్‌కి సంబంధించి సరైన డాటా అందించాల్సి ఉందన్నారు. ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా 10డి ఫారాలు నింపి పంపాలన్నారు. దీనికి ఎటువంటి సహకారం కావాలన్నా విశాఖ జిల్లాలో ఉన్నా యూనిట్లను సంప్రదించవచ్చన్నారు. ఆరోగ్య సమస్యలు పరిష్కారానికి రిటైర్డ్ ఆర్‌టీసీ ఉద్యోగి, గుండె వైద్య నిపుణుడు అయిన సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించాలని, ఎంవీపీలోని సంస్థ డిస్పెన్సరీలో ప్రతి శుక్రవారం ఉచిత కన్సల్టేని సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో ఏవీ రావు, రాయి, ఇతర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు

నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్(విశాఖ, హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కామెడీ షో జరిగింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, పుష్యమి, రాగస్ నాయుడు, సూర్య, ఎస్.ఎస్.నాయుడు, పోర్టు శేషు, భానుప్రకాష్‌లు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. అత్తగారి ఏడుపు, థియేటర్‌లో ఉన్నాను, కవిత, అన్నదానం, ఎంతమంది పిల్లలు, దారి ఎటు పోతుంది, సెలూన్, ఇంజినీరింగ్ కుటుంబం, రేటు ఎంత, డాక్టర్ పేషెంట్, డిశ్చార్జ్ ఎప్పుడు నాటికలు అలరించాయి. శివా క్లాసికల్ డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ అండ్ యోగా గురువు శివా శిష్య బృందం లిఖిత, సంజన చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను అతిథులు సన్‌మూర్తి, మాల్యాద్రి, సాత్యకి ప్రసాద్, విశ్రాంత డీపీఆర్‌వో ఎల్.బి.వెంకటరావు చేతుల మీదుగా సత్కరించారు.